

శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దత్తస్వామి

# శ్రమతో సేవ - సేవతో కైవల్యం

వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్          ఎడిటర్స్ : VAS ప్రసాద్, గొర్తి సాయి సుబ్రహ్మణ్యం

శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన "శ్రమతో సేవ - సేవతో కైవల్యం" ను అనుసరించి మా జన్మలు ధన్యం గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలను, సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధించిన సత్సంగ, సద్గ్రంధ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్ని సేవ.

గమనిక : ఎవరైనా ఈ మాగజైన్ లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవారు saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు

సంపుటి : 09

సంచిక : 05

మార్గశిర పౌర్ణమి

డిసెంబర్ 4, 2025

**నేపథ్యం:**

**జీవన కళ**


| | |
|---|---|
| పూజ్యశ్రీ భరద్వాజ మాస్టారి ప్రవచనం | లౌకిక జీవనము - ఆధ్యాత్మికత అను ఈ శ్రీ భరద్వాజ మాస్టారి ప్రవచనములో నిత్య జీవితంలోని ప్రతి సంఘటనలోనూ గురు సేవా భావం మేళవించటమే - జీవన కళ-ఆధ్యాత్మిక జీవన కళగా, అలా జీవిస్తూ గురుసేవతో సార్ధకం చేసుకొనే విధం తెలుపుతారు. |


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

నీవే తల్లివి తండ్రివి - నీవే నా తోడునీడ నీవే సఖుడవు !

నీవే గురుడవు దైవము - నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా !!

నీ పాద కమల సేవయు - నీ పాదార్చకుల తోటి నెయ్యము !

నితాంతాపార భూత దయయున్ - తాపస మందార నాకు దయ సేయగదే !!

## విషయ సూచిక


**శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధ** **4**

**భక్తుల అనుభవాలు** **13**

**శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు** **15**

23-07-2005 సాయికి: శిష్యుల యొక్క గొప్పతనం 15

26-07-2005 సాయి కి: దుస్థితి భావన - హృదయపూర్వక ప్రయత్నం 16

15-09-2005 లక్ష్మక్క గారికి, సాయి కి: శ్రీ మాధవదాసు గారి చరిత్ర 18

21-02-2005 జి.ఎస్.ఆర్. శాస్త్రి గారికి, లక్ష్మక్క గారికి: పైత్యం - నిమ్మరసం 20

**సార్ సత్సంగం** **21**

**మహాత్ముల వాక్యాలు** **25**

**ఈ చూడబడేదంతా కలసి నేను** **25**



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి






సద్గురు శ్రీ  సుబ్బరామయ్య మహారాజ్


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

# సంపాదకీయం

ఓం సాయిరాం

## శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధ

శ్రీ సుబ్బరామయ్య సార్ జీవితం భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి మరియు శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ గారి బోధల సారానికి, శరణాగతికి, నిష్కామ కర్మకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది. మహాత్ములు తమ జీవిత విధానం ద్వారానే ఉత్తమ జీవనాన్ని, ఆధ్యాత్మిక మార్గాన్ని కోరేవారికి మార్గదర్శనం చేస్తారని, "మహాత్ములు మనకు దైవం కంటే ఆప్తులు" అని మాస్టర్ గారు పేర్కొన్నారు. శ్రీ సార్ జీవితం నుండి మనం నేర్చుకోవలసిన ముఖ్యమైన అంశాలు కొన్ని స్మరించుకొందాము.

**1. మానవత్వం** : శ్రీ సార్ జీవిత విధానం ద్వారా బోధించిన ముఖ్య సందేశం "పరోపకారార్థం ఇదం శరీరం" (ఈ శరీరం పరోపకారం కోసమే - అన్ని జీవుల రూపంలో ఉన్న శ్రీ వెంకయ్య స్వామి సేవ కొరకే).

ఉదాహరణకు సార్ చిన్నప్పటి నుంచే బాధలో ఉన్నవారికి సాయం చేయకుండా ఉండలేక పోయేవారు. చిన్నతనం లోనే వంటి జిలతో బాధ పడుతున్న వృద్ధురాలికి వచ్చిన చర్మవ్యాధిని నెల్లూరు ఆసుపత్రిలో చేర్పించి నయం చేయించారు.

మాస్టర్ గారు పరిచయం అయ్యాక ఆత్మ ఉన్నతి సాధించే విశేష సాధన చేస్తూ , సార్ గురు సేవ, నిష్కామ కర్మ ద్వారా తనను తాను శిక్షణ ఇచ్చుకున్నారు. శ్రీ సార్ గొలగమూడిలో ఉండటానికి వచ్చినప్పుడు, భక్తుల కోసం తమ ఇంటిలో సగం పోర్షన్‌ను ఇతరులు వండుకోవడానికి, ఉండటానికి ఇచ్చేవారు. తన నివాసం గురించి ఆలోచించకుండా, భక్తుల సౌకర్యం కోసం సాయి మాస్టర్ నిలయం నిర్మించి గురు సేవ చేశారు.

పరోపకారార్థం ఇదం శరీరం అనే సందేశాన్ని ఆచరిస్తూ, వేసవికాలంలో మధ్యాహ్నం ఎండలకి కూలీలు విశ్రమిస్తున్నప్పటికీ, సార్ మాత్రం తలకు గుడ్డ కట్టుకుని, చెప్పులేసుకుని ఉత్సాహంతో నిర్మాణ కార్యక్రమాలకు (మఠం, నిలయం) వెళ్లేవారు. గురువును విశ్వరూపునిగా దర్శిస్తూ శ్రీ సాయి మాస్టర్ నిలయం, అనాథాశ్రమం, ధ్యాన మందిరాలు వంటివి భక్తుల సేవగా నిర్మించి నిర్వహించారు.

## 2. గురుభక్తి :

గురువు ఆదేశాలను, గురువుపై విశ్వాసాన్ని జీవితాంతం నిలబెట్టుకోవడం, గురువుకు కాలాన్ని, మనసును సమర్పించడం గురుభక్తి. శ్రీ సార్, శ్రీ భరద్వాజ మాస్టర్ గారి ఆదేశానుసారం, "కాలము, మనసు దైవానికి (గురువుకు) సమర్పించాలి" అనే ఆదేశాన్ని పాటించారు. దానిలో భాగంగా, ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు (మూడు గంటలు) పూజ, ధ్యానం కోసం సమయం కేటాయించారు. ఈ నిరంతర సాధన

ఫలితంగా, మూడు సంవత్సరాల తరువాత, శ్రీ సాయి తలుపు కొట్టినా తెలియని అలౌకిక ధ్యాన స్థితిని (దివ్యమైన శాంతిని) ప్రసాదించారు.

### 3. గురు ఆదేశానుసారం కఠోర నియమ పాలన :

శ్రీ సార్ జీవితాంతం గురువుల ఆదేశాలను కఠినంగా పాటించారు, ఇది వారి గురుభక్తికి నిదర్శనం. వెంకయ్య స్వామి పంచశీల సూత్రాలను (సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ) జీర్ణించుకు జీవించారు. ఉదాహరణకు "కోనేరు దాటి పోతే గాడిదతో సమానం" అన్న స్వామి ఆదేశం మేరకు, దాదాపు 25-28 సంవత్సరాలు (పెన్షన్ లైఫ్ సర్టిఫికేట్ కోసం నెల్లూరు వెళ్లిన ఒక రోజు తప్ప) గొలగమూడి దాటి వెళ్లలేదు. చెయ్యి విరిగినా, కాలు విరిగినా, పక్షవాతం వచ్చినా కూడా ఈ నియమాన్ని ఉల్లంఘించలేదు. స్వామి ఆజ్ఞపాటిస్తూ అక్కడే ఉండి స్వామిపై శరణాగతి చేశారు. బ్రహ్మంగారి మఠం నిర్మాణం సమయంలో పడి చేయి విరిగినప్పుడు, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వెళ్లమని ఒత్తిడి చేసినా, సార్ "నేను చావనన్న చస్తాను కానీ నెల్లూరు రాను" అని గొలగమూడిలోని కోనేరు దాటకూడదు అన్న స్వామి చెప్పిన నియమాన్ని అతిక్రమించలేదు. అలాగే, స్వామి ఆదేశానుసారం దాదాపు 30 సంవత్సరాలు నూనె, ఉప్పు, పులుపు, కారం లేకుండా జీవించారు.

### 4. నిరంతర గురు స్మరణ :

సార్ “మరుపే మరణం”గా భావించి నిరంతరం గురు స్మరణలో జీవించారు. ఉదాహరణకు శ్రీ సార్ ప్రతిరోజూ ఉదయం 2 గంటలకు వెంకయ్య స్వామి సమాధి మందిరంలో పూజ చేసే సమయంలో, శరీర స్పృహ, బాహ్య స్పృహ ఉండేది కాదు, ఎంతో పరవశంతో పూజ చేసేవారు. సమయం పూర్తయ్యాక ఇతర సేవకులు కర్టెన్ లాగితేనే పూజ ముగించేవారు. ఈ విధంగా పూజ చేయడానికి సాయంత్రం 6 గంటలకే రాత్రి ఆహారం (అన్నం) తీసుకోవడం, రాత్రి 9 గంటలకు పడుకోవడం, వంటివి క్రమం తప్పక చేసేవారు. గురు స్మరణ ఎంత బలంగా ఉంటే, జీవితంలో జరిగే ప్రతి సంఘటనలోనూ గురువు యొక్క కర్తృత్వాన్ని గుర్తించగలమని, తద్వారా కృతజ్ఞతతో జీవించవచ్చని శ్రీ సార్ తమ ఆచరణ ద్వారా చూపారు.

**5. సంపూర్ణ విశ్వాసం, శరణాగతి (Complete Faith and Surrender):**

శ్రీ సార్ "విశ్వాసమే మొదట రావలసిన పరిణితి" అని నొక్కి చెప్పారు. సద్గురువు సర్వజ్ఞుడు, సర్వ సమర్థుడు, సర్వ వ్యాపకుడు అనే అవగాహనతో కూడిన విశ్వాసం ముఖ్యం అని హెచ్చరించారు. శ్రీ సార్ జీవితంలో కష్టాలు, సమస్యలు ఎదురైనప్పుడు కూడా సంశయం, దైన్యం లేకుండా జీవించారు. సద్గురువు సర్వజ్ఞుడు, సర్వ సమర్థుడు, సర్వ వ్యాపకుడు అనే అవగాహనతో కూడిన దృఢమైన విశ్వాసం కలిగి ఉండటం. ఉదాహరణకు ఇంటి స్థలం వివాదం వచ్చినప్పుడు, ధర్మం - దైవ పై పూర్ణ విశ్వాసం గల శ్రీ సార్, అవతలివారితో, "మనమిద్దరి చేతులు స్వామి అఖండ

దీపం నూనెలో పెడదాము. నాది అధర్మమైతే నా చేయి కాలుతుంది, లేకుంటే నీ చేయి కాలుతుంది" అని ధైర్యంగా సవాలు చేశారు. ఇది ధర్మం పై సార్ కు గల అపార విశ్వాసానికి నిదర్శనం. అలానే వారి కుమారుడు శేషయ్య నెల్లూరులో తప్పిపోయినప్పుడు, భార్య వెతకమని భాధ పడితే, సార్ "వెంకయ్య స్వామి గొలగమూడి రప్పించు కొన్నది - వెతుక్కొనుటకా. స్వామి రెండవ రోజుకు తీసుకు రాకుంటే వెతుకుతాను" అని  స్వామి పై విశ్వాసంతో బడికి వెళ్లారు. స్వామి ఎందరినో ప్రేరేపించి బిడ్డను  క్షేమంగా ఇంటికి రెండు రోజుల్లోపే చేర్చారు.

### 6. అల్లా మాలిక్ ఎరుకతో జీవించడం:

సార్ జీవితంలో ధనేషణ, దారేషణ, పుత్రేషణ (డబ్బు, భార్య, పిల్లలపై కోరికలు) లను "అల్లా మాలిక్" (అంతా భగవంతుని సంకల్పమే) అనే ఎరుకతో అధిగమించారు. "అంతా భగవంతుడే, అంతా ఆయన సంకల్పమే" అనే ఎరుకతో జీవించడం, సంశయము-దైన్యం లేకుండా శరణాగతిలో నెలకొని ఉండటం - నిర్భయత్వం శ్రీ సార్ సహజ లక్షణం. గొలగమూడిలో శ్రీ సార్ ఉండటం ఇష్టం లేని కొందరు, సార్‌ను ఇంట్లో బంధించి తగలబెట్టాలని బెదిరించినప్పుడు, సార్ మాస్టర్ గారి మాట "సమయము వచ్చినప్పుడు ఎక్కడైనా మృత్యువు కొడుతుంది" అని గుర్తు చేసుకుని, హాయిగా వెళ్లి నిద్రపోయారు. తన జీవిత మరణాల గురించి పూర్తి ఇష్టాన్ని స్వామికి శరణాగతి చేశారు.

**7. సత్యం / ధర్మాచరణ & సాధారణత్వం :**

సత్యాన్ని పాటించడం, గురువు పంచశీల సూత్రాలలో ఒకటైన సాధారణత్వంతో జీవించడం, విధులలో ధర్మాన్ని పాటించడం. ధర్మ పరిరక్షణ శ్రీ సార్ జన్మ సంస్కారము. ఒక అల్లరి యువకుడు ఒక చిన్న పిల్లాడిపై దౌర్జన్యం చేసి డబ్బులు ఇవ్వకుండా వ్యాపారం దెబ్బతీస్తుంటే, శ్రీ సార్ ఆ దారిని వెళుతూ ఆ అల్లరి యువకుని ఎదుర్కొని ధర్మాన్ని నిలబెట్టారు. అలాగే ఒక వ్యక్తి తన భార్యను రోడ్డుపై కొడుతుంటే, సార్ అతనిపై బడి హెచ్చరించారు.

**8. గురు సేవ (Guru Seva) & నిష్కామ కర్మ :**

ఆత్మ ఉన్నతి సాధించడానికి, "పరోపకారార్థం ఇదం శరీరం" అనే సందేశంతో, నిస్వార్థంగా గురు సేవను విశ్వ గురు సేవగా సలిపారు. ఉదాహరణకు శ్రీ సార్ అవధూత లీల గ్రంథాన్ని స్వామి మొదటి ఆరాధనకల్లా ప్రచురించడానికి, మూడు నెలల పాటు మానవాతీత శ్రమ చేశారు. ఉద్యోగం, నివాసం, పూజ వంటి నియమాలు ఉన్నప్పటికీ, రోజుకు కేవలం 2 గంటలు మాత్రమే నిద్రపోయేవారు. ఈ దీక్ష పూర్తయ్యే వరకు సైకిల్‌కు 19 పంక్చర్లు ఉన్నా గాలి పోలేదు, ఇది గురు కృప వలన సేవ సాఫల్యం చెందడానికి నిదర్శనం. సార్ తన సంపన్నత్వాన్ని (ఆధ్యాత్మిక/లౌకిక) తన కోసం కాకుండా, విశ్వగురు సేవ కోసం ఉపయోగించారు. వెంకయ్య స్వామి గురించి, మాస్టర్ గారి గురించి 40కి

పైగా గ్రంథాలు రచించి, లక్షల పుస్తకాలను ఉచితంగా భక్తులకు అందించి సన్మార్గంలో నడిపించారు.

**9. భక్తవత్సలత & ప్రేమ :**

భక్తుల పట్ల అపారమైన కరుణ కలిగి ఉండటం, వారి కష్టాలను, అనారోగ్యాలను నివారించడం. ఉదాహరణకు హైదరాబాద్‌కు చెందిన సాయిలక్ష్మి గారికి భయంకరమైన చర్మవ్యాధి వచ్చినప్పుడు, శ్రీ సార్ ఏమాత్రం భయపడకుండా, సంకోచించకుండా వారికి శుశ్రూషలు (సపర్యలు) చేశారు. ఎందరో పిల్లలు ఆర్తులు - అర్థార్తులుగా శ్రీ సార్ చుట్టూ చేరినప్పుడు వారిని కన్నా బిడ్డల్లా చూస్తూ జిజ్ఞాసువులు - ముముక్షువులుగా మారుస్తూ వారి సర్వ భాద్యతలు నడిపించటం. తనకు వంట నేర్పిన రాజగోపాల్ అయ్యవారికి గొలగమూడిలో ఉండే అవకాశం కల్పించి వారికి అవసరమైన వసతులు స్వయంగా నిర్మాణం చేసి ఇచ్చారు. పక్షవాతం వచ్చినప్పుడు వారి ఇంటికి వెళ్లి నామం వ్రాయించి, సత్సంగానికి పిలిపించి ఆ రోగాన్ని తగ్గించారు.

**10. బోధనా దక్షత :**

శ్రీ సార్ భక్తులకు వారి వారి పరిపక్వత స్థాయిని బట్టి మార్గదర్శనం చేసేవారు. ప్రసాద్‌కి ఉప్పు, నూనెలు వదిలేస్తే మంచిదని ఒకేసారి చెబితే ఇబ్బంది పడతాడని గ్రహించి, నాలుగైదు వారాల వ్యవధిలో మెల్లగా ఆ విషయాన్ని అర్థమయ్యేలా చేశారు. విద్యార్థులను వేతనాలతో చదివించడం, వారికి నిష్కామకర్మలో పాలు పంచుకునేలా చేయడం, లేఖల ద్వారా

లోపాలను సరిదిద్దుతూ మార్గదర్శనం చేయడం సార్ బోధనాదక్షతకు ఉదాహరణలు. గురువు ఆదేశాలను ఆచరణలో ఉంచి, తమ అనుభూతులను భక్తుల పరిపక్వతకు అనుగుణంగా సరిదిద్దడం శ్రీ సార్ మీద ఆధార పడిన అందరు గమనించవచ్చు. ఈ క్రింది అనుభవాలు భక్తుల అంతరంగిక భావాలు కూడా సార్‌కు తెలుసని, ఆయన వాటిని సరిదిద్దే శక్తిమంతుడని నిరూపిస్తాయి. కొన్ని ఉదాహరణలు

* లోపాలను సరిదిద్దడం: ఒక భక్తుడు తన చెడు ఆలోచనల గురించి బాధపడుతూ, సార్‌కి లేఖ రాశాడు. ఆ లెటర్ రాయగానే మరుక్షణం నుండీ ఆ చెడు ఆలోచనలు మరలా రాలేదు. సార్ లేఖలు కేవలం పదాల కూర్పు మాత్రమే కాదని, శక్తివంతమైన మంత్రతుల్యాలని ఎందరో సాధకులకు అనుభవమని ఆధారాలు తెలుపుతున్నాయి.

* బోధలో సూక్ష్మత: శివరత్నం ప్రాణాయామం నేర్చుకుంటూ, విరోచనం కాకపోయినా అభ్యాసం మొదలుపెట్టడం వలన శ్వాస పీల్చడం కష్టమైంది. 7 సంవత్సరాలు బాధపడ్డాక సార్‌కు చెబితే, సార్ వెంటనే "స్వామి దగ్గర 40 రోజులు దీక్ష చేయమన్నారు". మనసు ఏకాగ్రతగా లేకపోయినా, తాను చెప్పినట్లు ప్రదక్షిణలు చేయమని ఆదేశించారు. యోగంలో వచ్చిన ఇబ్బందులు యోగ పరిపూర్ణులే తీర్చగలరు.

* త్రికరణ శుద్ధి: మరొక భక్తుడు దీక్ష అని ఉపవాసం ఉండలేక "నన్ను చంపెయ్" అని గుడిలో కోరుకున్న విషయం, సార్ ఆ భక్తుడు తన వద్దకు రాగానే అతనేమీ చెప్పకుండానే ఉపవాసం వద్దని ఆదేశించారు.

*చాపల్యాల నివారణ: ప్రసాద్‌కి ఉప్పు, నూనెలు వదిలేయాలని తెలిసినా, ఒక్కసారిగా చెప్పకుండా, మొదట జిహ్వా చాపల్యం గురించి మాత్రమే ప్రస్తావించారు. నాలుగు వారాల తర్వాత నూనె, ఉప్పు మానేస్తే హాయిగా ఉంటుందని వివరించారు. సమయం ఇచ్చి, భక్తుడు ఆచరించేలా చేయడం సార్ బోధనాదక్షత.

**11. సర్వజ్ఞత్వం, కరుణామయత్వం:**

గురువు కృప వలన భక్తుల లోపాలను సరిచేయగలగడం, వారికి తెలియకుండానే వారిని ప్రమాదాల నుండి, తప్పుడు నిర్ణయాల నుండి రక్షించగలగడం. శ్రీ సార్ లోని సర్వజ్ఞత్వ, సర్వ సమర్థతలు ఆయన జీవిత విధానంలో స్పష్టంగా కనిపిస్తాయి. ఆయన భక్తుల మనసులోని ఆలోచనలను, సంశయాలను క్షణాల్లో తెలుసుకుని పరిష్కరించేవారు. ఉదా

* గురు సేవ: కోనేరు దాటి సార్ వెళ్లరు కదా, ఏదైనా నెల్లూరు పని ఉంటే చేద్దాము అనుకొన్న  శివను నవ్వుతూ "ఏం శివా నెల్లూరు వెళ్ళి వస్తావా?" అని అడిగి భక్తుల పట్ల ఆయన సర్వవ్యాపకత్వాన్ని నిరూపించారు.

*సమయానుకూల సందేశం: ప్రసాద్ ఆఫీసు పని రొటీన్‌గా ఉందని ఉద్యోగం రాజీనామా చేయాలని మనసులో అనుకున్నాడు. గొలగమూడికి వచ్చి సార్‌కి చెప్పకపోయినా, సత్సంగంలో మధ్యలో ప్రసాద్ వైపు వేలు చూపి, "ఉద్యోగం రాజీనామా చేయవద్దు" అని చెప్పి మరలా భరద్వాజ మాస్టర్ గారి గురించి చెప్పడం కొనసాగించారు. ఆ మాటలకు ప్రసాద్‌కు ఆ ఆలోచన పోయింది, ఆర్థికంగా ఏ ఇబ్బందీ లేకుండా పోయింది.

*లోపాలు సరిదిద్దడం: ఒక లెక్చరర్ విద్యార్థిని ప్రేమించినప్పుడు, తల్లిదండ్రులు ఆస్తి సంబంధాలు వదులుకోమంటే, వామోహం వలన తల్లిదండ్రులను వదులుకుందామనుకున్నాడు. అతను మనసులో అనుకున్న విషయాన్ని సార్‌తో ఏకాంతంగా మాట్లాడే అవకాశం లేకపోయినా, బస్సులో నిద్రపోతున్నప్పుడు సార్ కలలో కనపడి "ఇది తప్పు" అని చూపించారు, వెంటనే అతని వామోహం తగ్గిపోయింది. ఇది శ్రీ సార్ సర్వజ్ఞతకు ఉదాహరణ.

## భక్తుల అనుభవాలు

ఓం సాయిరాం

**మదన్ కుమార్** ఇలా చెప్తున్నారు: చీరాల స్వామి దగ్గరికి వెళ్ళినప్పుడు జరిగిన అనుభవం చీరాలలో మా బంధువుల ఫంక్షన్ కి వెళ్ళాను. ఫంక్షన్ అయిపోయేసరికి మధ్యాహ్నం సుమారు ఒకటి అయింది. అప్పుడు బాగా ఎండగా ఉంది. గూగుల్ మ్యాప్ లో చీరాల స్వామి సమాధి మందిరం అడ్రస్ పెట్టి కారులో వెళ్తున్నాను. మా అత్తగారు కూడా మా కుటుంబంతో పాటు ఉన్నారు. ఒక చోట రోడ్డు బ్లాక్ అయిపోయింది. అక్కడినుంచి గూగుల్ మ్యాప్స్ ఇంకొక దారి చూపెడితే అటు వెళ్తే అక్కడ కూడా రోడ్డు బ్లాక్ అయింది. అక్కడి నుండి మరలా గూగుల్ మ్యాప్స్ చీరాల స్వామికి ఇంకొక దారి చూపెడితే ఆ దారి ప్రకారం వెళ్లి చీరాల స్వామి మందిరం దగ్గరికి వెళ్లేసరికి ఒకటిన్నర అయింది. దీన్ని బట్టి నాకు ఏమి అర్థమైంది అంటే

గమ్యము లక్ష్యము గుర్తుంటే మార్గం అదే కనబడుతుంది. గురువును అంటిపెట్టుకుంటే ఆయనే గమ్యానికి తీసుకుపోతారు.

నిత్యజీవితంలో అన్ని రకాల స్వామిని గుర్తు ఉంచుకుంటే స్వామి గైడ్ చేస్తారు. ఈ మధ్య మా ఆఫీసులో ఒక డిప్యూటీ డైరెక్టర్ గారు రిటైర్ అయ్యారు. ఫంక్షన్ కి నేను ఒక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తయారు చేశాను. ఆ ప్రజెంటేషన్ లో ఆయనలో ఉన్న ఆల్ యాస్పెక్ట్స్ (గుణగణాలు, ప్రజెంటేషన్, లీడర్షిప్, టెక్నికల్, మేనేజ్రియల్ అన్ని ఆస్పెక్టివ్ కవర్ చేస్తూ) ఎనాలసిస్ చేసి ఆయన గురించి స్లైడ్స్ తయారు చేసి ప్రెజంట్ చేశాను. అది బాగా రక్తి కట్టింది. అందరూ కూడా చాలా ఎమోషనల్ గా అయ్యారు. ఆయన ప్రత్యేకంగా ఈ యొక్క స్లైడ్స్ లో ఉన్న ఇన్ఫర్మేషన్ చూసి చాలా ఎమోషనల్ అయ్యారు. అప్పుడు దాని తర్వాత ఇంటికి వచ్చి నా భార్యకి చెప్పాను. నా భార్య వెంటనే వారం రోజుల నుండి పిల్లల్ని నన్ను పట్టించుకోకుండా చేసుకుంటూ ఉంటే ఈ ప్రజెంటేషన్ ఎవడికి కావాలి అన్నది. నాకు కోపం రాలేదు కానీ అందరిలో ఉన్న భగవంతుడు వెంకయ్య స్వామి ఇలా చేయిస్తున్నాడు, ప్రవర్తిస్తున్నాడు అనుకున్నాను. బాధ కలగలేదు. ఇది ముఖ్యంగా జరిగింది ఎందువలన అంటే వెంకయ్య స్వామిని మదిలో గుర్తుంచుకోవటం వల్ల జరిగింది.

చీరాల నుండి బయలుదేరి గొలగమూడికి సార్ మందిర ప్రతిష్టాపన కోసం వస్తున్నాము. మధ్యాహ్నం రెండు గంటలు అవుతుంది. ఆ


సమయానికి భోజనం ఉండదేమో అనుకున్నాను. మేము వచ్చేసరికి 2:30 అయింది వెంకయ్య స్వామి మందిరంలోకి అన్నదాన మంటపంలోకి భోజనం కోసం వెళ్తే అక్కడ భోజనం అయిపోయిందన్నారు. కొంచెం మనసులో బాధపడ్డాను. ఏంటి స్వామి నీ ప్రసాదం తిందామని చెప్పి వస్తే ఇట్లా అయింది? అని చెప్పి మనసులో బాధపడ్డాను. తర్వాత అక్కడి నుంచి బయలుదేరి శ్రీ సాయి మాస్టర్ నిలయంలోని సుబ్బరామయ్య సార్ మందిరంలోకి వచ్చాము. అక్కడ ఇక్కడ సుబ్బరామయ్య సార్ కి నివేదన ఇచ్చిన నైవేద్యం నాకు పెట్టారు. ఇన్నేళ్లుగా సార్ దర్శనంకి వస్తున్నా కూడా ఎప్పుడూ ఇలా జరగలేదు. అప్పుడు స్వామి యొక్క కరుణకి ఆనందం వేసింది. అందువలన స్వామి మన కన్నీటికి ప్రార్ధనకి కరిగిపోతారు. ఈ మహనీయుల చరిత్ర వలన మన లోపల ఉన్న సాఫ్ట్వేర్ అప్డేట్ అయితే బాగుంటుంది. ఈ సాఫ్ట్వేర్ అప్డేట్ అంటే సత్సంగాల్లో మన యొక్క దుర్గుణాల గురించి మనం నేర్చుకోవాల్సినవి నేర్చుకుంటూ ఉంటే సాఫ్ట్వేర్ అప్డేట్ గా భావిస్తున్నాను.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

ఓం గురుభ్యోనమః

# శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు

## 23-07-2005 సాయికి: శిష్యుల యొక్క గొప్పతనం

OM

గొలగమూడి

23-07-05

Dear Sai!

"శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయిచరిత్ర మానవజాతికి రెండు కన్నుల వంటివి" అన్నారు శ్రీ మాస్టారు. దైవం ఎట్లా కనబడతాడు ? అంటే మాధవదాసు చరిత్ర, బ్రహ్మంగారి చరిత్ర చదవమన్నారు. వీటన్నింటిలో శిష్యుల యొక్క గొప్పతనం, శిష్యరికం యొక్క top పవిత్రత గురువాజ్ఞను పాటించడంలో ఇమిడి ఉంది. నువ్వే నడిపించు, అంటూ తన ప్రయత్నమే లేకుండా కూర్చున్నారా? ఎండిన మేడికొమ్మ ఇచ్చి నీళ్లు పోయమంటే, ఓరి పిచ్చి స్వామి బ్రతుకుతుందా? అని కూర్చోలేదు. నీరు నిర్విరామంగా పోసి సఫలుడు అయ్యాడు. మాలంభాయి కి కటిక నేల, మంచినీరు విధిస్తే వారి ఆజ్ఞనుసారం ఆచరించి, చచ్చింది. కానీ ఆ దయామయుడు బ్రతికించాడు. కుక్క డోలులో నీరు త్రాగమంటే గురువాజ్ఞే ధ్యేయమని త్రాగి సఫల్య మొందాడు. నీరు తెమ్మని అరణ్యంలో మాధవదాసుని పంపితే, శక్తివంచన లేకుండా నీటి కొరకు ప్రయత్నించాడు. కనుకనే హంసల రూపంలో గురుడే నీరు చూపిస్తాడు. ఋణానుబంధానుసారం ఈటెలసానికి గాడిదలు కాచి,

ఋణానుబంధం తీరగానే సఫలీకృతుడయ్యాడు. శ్రీస్వామివారి ఆజ్ఞను హృదయపూర్వకంగా ఆచరించి తరించే ప్రయత్నం చేద్దాం. ఇంద్రియలోలత తీవ్ర ప్రయత్నంతో నిరోధిద్దాం.

పెసల సుబ్బరామయ్య

-----------------------శ్రీ సద్గురు దేవా శరణం శరణం -------------------------

**26-07-2005 సాయి కి: దుస్థితి భావన - హృదయపూర్వక ప్రయత్నం**

OM

గొలగమూడి

26-07-05

Dear Sai!

20.07.05 న వ్రాసిన లెటర్ లో నా దుస్థితి వెల్లడించుకొని అని వ్రాశావు. నీకు దుస్థితి కలిగిందని తలంచుచున్నావా? అలా భావించినట్లయితే "దుఃఖము, భయము, ఆందోళన ఉంటే ఆయన యందు విశ్వాసం లేనట్లే" అంటారు మాస్టారు గారు. ఇది అక్షర సత్యం. నీ కంటే దుస్థితిలో ఉన్న వారెందరున్నారో ఊహించవా? నీకు Eligibility టెస్ట్ అయ్యాక చెబుతాను. ఆ ప్రదేశాలు మద్రాసులోనే ఉన్నాయి. అక్కడికి అమ్మా, నువ్వు వెళ్లి ఆ ప్రదేశాలు చూస్తే దుస్థితిలో మనమా, వారా ఉన్నది? అనేది తెలుస్తుంది. మనము కోటానుకోట్ల రెట్లు వారి కంటే ఉన్నతమైన స్థితిలో ఉన్నాము. **ఇప్పుడు నీవు చేయవలసిన ప్రార్థన, ప్రయత్నం ఒక్కటే! తమరు ఆజ్ఞాపించిన పనిని మీకు ప్రీతిపూర్వకంగా నెరవేర్చునట్లు చేసేటట్లు చేయవే ప్రభు.** ఇంద్రియలోలుడనే చేస్తావో, కఠోర నియమపాలన చేయిస్తారో అదంతా వారికే వదులు. Subconscious లో ఉండే మలినాన్ని బయటకు

తోడేస్తున్నారు. **మన ప్రయత్నం అంతా వారిచ్చిన పని చేయడమే.** ఇంద్రియలోలత, సోమరితనముతో ఉండి ఆయనను ప్రార్థించమనడం లేదు. వాటిపై యుద్ధము చేస్తూనే, మనకు ఇచ్చిన పని చాలా టాప్ గా నిర్వహించాలి. గురువుగారికి మన హృదయపూర్వక ప్రయత్నం ద్వారా ఆనందం కలిగించాలి. డిగ్రీలో నేను క్లాసులో ర్యాంక్ స్టూడెంట్ గా ఉండి చివరిలో సీటింగ్ మారినందున 45 నిమిషాలు కూర్చుని వ్రాయక సీటు వెతుక్కోవడంలో పోయి చొక్కాతో సహా చెమటకు తడిసి “తెలుగు” పరీక్ష ఏమీ రాయలేకపోతే 33 మార్కులు వచ్చాయి. ఆ సర్వేశ్వరుడు ఆ తర్వాత జరిగిన “హ్యూమన్ అచీవ్మెంట్స్” అనే పేపర్లో 78 మార్కులు వస్తే తెలుగులో తగ్గిన రెండు మార్కులు కండోన్ చేసి పాస్ చేశారు. మన ప్రయత్నమే ప్రధానం. ఎలాంటి ప్రయత్నం? “హృదయపూర్వక ప్రయత్నం” చేస్తుంటే, (అంటే) రాకెట్ భూకక్ష నుంచి స్పేస్ లోకి ఎంటర్ అయ్యే ప్రయత్నం చేస్తుంటే ఆ సర్వజ్ఞమూర్తి కరుణిస్తారు. నీవు ఏమీ అధైర్యపడవద్దు. దుస్థితి అనుకోవద్దు. ఇది సత్యం. శ్రీ స్వామి సత్యసందుడు. తన తోకా తొండము చూపి నీకు నిరాశ ఎదురయ్యేటట్లు చేయడు. నా మాట మీద నమ్మకం ఉంచి టెన్షన్ వదులు.

పెసల సుబ్బరామయ్య

-------------------------శ్రీ సద్గురు దేవా శరణం శరణం ------------------------

**15-09-2005 లక్ష్మక్క గారికి, సాయి కి: శ్రీ మాధవదాసు గారి చరిత్ర**

OM

గొలగమూడి

15-09-05

పూజ్య గురుబంధువులైన లక్ష్మక్క గారికి చిరంజీవి సాయికి శ్రీ స్వామివారి ఆశీస్సులు సదా ఉండాలని ప్రార్థిస్తూ పెసల సుబ్బరామయ్య వ్రాయడం. అమ్మా నేను లెటర్ వ్రాయలేదని బాధ పడవద్దు. నాకు మతిమరుపు ఎక్కువైంది. అందులో మాధవదాసు గారి చరిత్ర పూర్తి చేయాలని మీకు లెటర్ వ్రాయడం మర్చిపోయాను. సాయి పరీక్ష బాగా వ్రాసాడని తలుస్తాను. మూడో పరీక్ష ఎలా వ్రాసింది ఇంకా లెటర్ రాలేదు. రేపు వస్తుందేమో! మాధవదాసు గారి చరిత్ర శ్రీ వెంకయ్యస్వామి వారు చదివించి వినిపించుకొని శరీరం ఎందుకు వదిలారో ఈరోజు మెరిసింది. తన గురువు నేలపై వ్రాసిన మంత్రము, ఈటెలసాని తాటాకు పై వ్రాసుకుని చెవులపై పెట్టుకుపోయిందని పశువులకాపరి చెబితే దాసుడు విన్నాడు. అంతేగాని దాసుడా మంత్రాన్ని కంటితో చూడలేదు, నోటితో ఉచ్చరించలేదు. ఆ మంత్రము దాసునికి ఈటలసాని నుండి లభించక ముందే నాలుక లేని కోటిగంటలు భువన-భోంతరాళములు దద్దరిల్ల మ్రోగినవి. దేవతలందరూ వారిపై పుష్ప వర్షము కురిపిస్తారు. స్వయంగా శ్రీకృష్ణుడే వారికి సంపెంగ నూనె తలకద్దుతారు. ధర్మరాజు, విదురుడు, ద్రౌపది మొదలైన వారంతా ఎంతో గౌరవంతో భక్తితో వారికి అభ్యంగన స్నానం చేయించి అలంకరించి నైవేద్యము హారతి ఇస్తారు. ఇట్టి గొప్ప మర్యాదలు జరిపి వారిని గౌరవించుటకు ఒకటే కారణం. నాలుక లేని కోటిగంటలు బోనభోంతరాళములు దద్దరిల్లేటట్లు వారి ఒక ముద్ద తినగానే మ్రోగడం. (అట్లే) ఆకు దొన్నలో బియ్యం నీళ్లు కడిగిపెట్టి కట్టెల పొయ్యపై

వంట చేయడమేమిటి? ఆకాశ మార్గాన వెళ్ళే హంసలు వారికి తమ నీడ గొడుగుగా పట్టి నీరు చూపడం ఏమిటి? వీటికి కారణమేమి? ఆలోచించాల్సిందే! దీనికి నాకు తోచిన జవాబు. శ్రీ వెంకయ్య స్వామి వారు చెప్పిన మాట "మంత్రం ఎక్కడుంది, తంత్రం ఎక్కడుంది. చూచుకుంటూ పోయేదే కదయ్యా! ఆశ పోతే అంతా పోతుండ్లా అయ్యా." చూసుకుంటూ పోవడం, ఆశ పోవడం, సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురుసేవ ఈ మాటలు ఎంత సత్యాలో శ్రీ మాధవదాసు గారి చరిత్ర నిరూపిస్తున్నాయి. అందుకే వారు చదివించుకుని విన్నారు.

శ్రీ స్వామివారి ఆశీస్సుల కొరకు ప్రార్థిస్తూ

మీ పెసల సుబ్బరామయ్య

------------------శ్రీ సద్గురు దేవా శరణం శరణం -----------------------

**21-02-2005 జి.ఎస్.ఆర్. శాస్త్రి గారికి, లక్ష్మక్క గారికి: పైత్యం - నిమ్మరసం**

OM

గొలగమూడి

21-02-05

పూజ్య గురుబంధువులైన శ్రీ జి. ఎస్. ఆర్. శాస్త్రి గారికి, లక్ష్మక్క గారికి నమస్కారములు. చి|| సాయికి శ్రీ స్వామివారి ఆశీస్సులు సదా కలగవలెనని ప్రార్థిస్తూ పె. సు. వ్రాయడం. మీరు ఇక్కడ నుండి హైదరాబాద్ వెళ్లిన మరు రోజు నుండి నాకు ఎడమ కాలు గజ్జల్లో గడ్డ లేచి, పగలక నొప్పి చేసింది. కట్టు నిలవదు, కట్టు కడితే కదలకుండా పడుకోవాలి. సుమారు పది రోజులు పూజకు, సత్సంగము నకు పోలేదు. శుక్ర, శనివారములకు పగిలింది. ఆదివారం మొత్తం పోయి నిన్న 20న కళాశ్రీ వేశారు.

మామూలుగా తిరుగుతున్నాను. సైకిల్ తొక్కుతున్నాను. నాలుగైదు రోజులు పగలు, రాత్రి నిద్ర పట్టేది లేదు. 12, 13, 14, 15, 16 తేదీల్లో నొప్పి పెద్దగా లేదు. అది శ్రీ స్వామి వారి దయ. అంత లావు గడ్డ ఉంటే చాలా నొప్పి ఉంటుంది. కానీ నొప్పి చాలా స్వల్పము. నిద్ర మాత్రం పట్టదు. నాలుగు రోజులు యాంటీబయాటిక్ మాత్రలు, రోజుకు రెండు లెక్కన ఎనిమిది మింగాను. దానివల్ల పూర్తిగా పైత్యం చేసి నిద్ర రాలేదు. నిమ్మరసం తోనే పైత్యం పోయి మామూలు నిద్రకు వచ్చాను. ఈ యాంటీబయాటిక్స్ దెబ్బ విపరీతమైన ఆకలి! ఆరు దోసెలు పెద్దవి తినేది. చద్దన్నం తినేది. రాత్రి ఒంటిగంటకు అన్నం ఉంచుకొని తినేది. లేకుంటే దోశలు గోధుమపిండి - ఉప్మా రవ్వతో భయంకరంగా తిన్నాను. అప్పుడు సాయి పరిస్థితి అర్థమయింది. నేను అంత తిన్నా ఆయసం రాలేదు. మామూలుగా అయితే ఆయసం తప్పక, అంత ఆహారం తింటే వచ్చి తీరుతుంది. ప్రస్తుతం మామూలు ఆహారానికి వచ్చాను. ఈ రోజు సోమవారం 21-02-2005 నుండి సత్సంగము, పూజకు పోతున్నాను. సాయి ఎక్కువ తినుచున్నాడని భయపడవద్దు. కక్కకుండా ఉంటే ఎంత తిన్నా పర్వాలేదు. అది నా అనుభవం. మామూలు కంటే మూడు రెట్లు ఎక్కువ తినేవాడ్ని. పాలు చెమిరేసి, గట్టి పెరుగు వేసుకునేది. అయినా యాంటీబయాటిక్స్ వల్ల కడుపులో దేవినట్లు ఉంటూ ఉండేది. పెరుగేసుకున్నా ఏమీ లేదు.

సాయి! ఏమి ఆవేశపడవద్దు. తొందరపడవద్దు. ఏ జీవి నోటిలో ఏ ధాన్యపు గింజ పడాలో దానిపై వ్రాసి ఉంచుతారట దైవం. నీళ్ళ ఋణం, నిద్ర ఋణం తీరాలి. కాలం వ్యర్థమైందని ఎందుకు బాధపడడం? కాలం సద్వినియోగం

చేసే ప్రయత్నం చెయ్యి. పుస్తకాలు చదువు, మననం చెయ్యి. తేడా, తేడా అని బాధపడవద్దు.

మరొక లెటర్ లో కంటిన్యూ చేస్తున్నాను.

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

## సార్ సత్సంగం

### మత్తహస్మృతిరిజ్ఞాన మపోహనంచ


బాగా వినండి ఇక్కడ. అప్పటి వరకు నాకు ఆ ఐడియా లేదమ్మా నేను ఇకను రాయబోయే దాన్ని నాకు ఐడియా లేదు. సూపరిండెంట్ కి రాయాలనే నేను వాడితో అన్నది.

కాగితం చేతికి తీసుకొని అట్టకు పెట్టుకున్నామయనా, బాంచత్! మార్చేసినాడు. మన బుర్రంతా మార్చేసినాడు. అది గాని తలుచుకుంటే ఆ క్షణము వరకు నాకున్న ఆలోచన ఏంటి? **మత్త: స్మృతిరిజ్ఞాన మపోహనంచ।** ఒరేయ్ నీకు వచ్చిన జ్ఞానం నేనే! అహంకరిస్తావేమో! నేను రాసినాను అనుకుంటావేమో! తప్పుడు గాడిద కొడక, నువ్వు కాదు రాసింది! నేను రాయించినా! అట్లా అనుకుంటే, మనకు ఒక రవ్వంత వస్తది, మనం ఏదన్నా అంచు గడతాం, లేకపోతే నడుము విరచుకుంటాం మునగ చెట్టెక్కి. ఆమాయన వెంటనే రాసేటప్పుడు To సూపర్ఇండెంట్ అని రాసేసా From పి.సుబ్బరామయ్య అని వ్రాశా! కింద బాడీ ఆఫ్ ది లెటర్లో చక చక చక మూడు మాటలే రాసానండి! చాలాసేపు రాయలేఁ! ఆలోచన, ఆలోచనే లేదు! మిమ్మల్ని మూడు సంవత్సరాల నుంచి మేము అడుగుతున్నాం, పర్మిషన్ ఇవ్వమని. మా అమ్మాయికి పెళ్లి చేసుకోవాల.

మీరు నాలుగు రోజుల లోపల మాకు పర్మిషన్ ఇస్తే ఇచ్చినారు. లేకుంటే రాత్రికి రాత్రి కట్టేస్తాను. నా పేరు ఇది! పెసల సుబ్బరామయ్య, నాది ఇల్లు, నువ్వు ఏం చేస్తావో ఎక్కడ చెప్పుకుంటావో చెప్పుకో జాగ్రత్త! ఇంకేం రాయలే! మా అమ్మాయికి పెళ్లి చేయాల మూడు సంవత్సరాల నుంచి మీతో కరస్పాండెన్స్ చేస్తున్నాం! ఇదిగో ఫలాని డేట్, ఫలానా డేట్, ఫలాన డేట్! నా దగ్గర రికార్డు ఉంది. ఇవన్నీ రిమైండర్స్ ఇచ్చి ఉన్నాం! మీరు నాలుగు రోజుల లోపల పర్మిషన్ ఇస్తే ఇచ్చినారు, లేకుంటే గోడ పగలుకొట్టి తెల్లవారేసరికి కట్టేస్తాను. నా పేరు ఇది, నాది ఇల్లు అని రాసేసి సంతకం పెట్టి, నేనే! వాడి చేత పెట్టించలా, నేనే పెట్టినా! రేఁయ్ ఈ కాయితం ఎత్తుకొని పోయి సూపరిండెంట్ చేతికియ్యి, వాడేమి చేస్తాడో వచ్చి నాకు చెప్పు, నీకు భయమైతే, వెంకయ్య స్వామి నన్నేమీ చేయడు! నేను వచ్చి కట్టిస్తా అక్కడనే ఉండి. ఒకరోజు రాత్రి పూట వదిలేస్తాను, స్వామికి దండం పెట్టి చీట్లు పెడతా! నీకు భయమైతే చెప్పు? లేకపోతే నేను రాను, నేను ఈడనే ఉంటాఁ నువ్వు కట్టించు! నలుగురు బేలుదారు వాళ్ళని పెట్టుకో, ఎంతండిఁ? ఇక్కడి నుంచి అక్కడి దాకా ఉంటది గోడ! ఇద్దరు బేలుదారోళ్ళు జాస్తి! ఆ పక్కోడు ఈ పక్కోడు ఉంటే. ఇద్దరు బేల్దారోళ్ని మాట్లాడుకో! నలుగురు కూలోళ్ళని పెట్టుకో! చక చక చక ఈ లోడిన మట్టి బయటకి వెళ్ళపోవాల! ఇక ముక్క కూడా ఉండకూడదు. అసలు ఎప్పుడు కట్టినాడు ఆ గోడ అనుకోవాల. చేయకుండా ఉండినావంటే తాట వలిచి పారనూకుతాను నిన్ను, అన్నా! ఆ మహానుభావుడు నడిపించేవాడు, ఎట్లా నడిపిస్తున్నాడో  చూడండి! ఆమాయనె వీడు కాయితం ఎత్తుకొని పోయి, సూపరిండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ దగ్గరికి పోలా వాడు,  ముందు ఎత్తుకొని పోయి పోస్టుమాస్టర్ కి ఇచ్చినాడు. సార్! ఏంది సార్ మీరు ఇట్లా









అంటుంటారే ఆయన ఇట్టా రాసినాడో చూడండి ఇట్లా చేస్తాడంట ఆయన వచ్చి అని! వాడికి జ్వరం వచ్చేసింది. ఓయమ్మో వాడు పగలకొట్టి కడతాడు కాబోల్నే! సూపరిండెంట్ నన్ను వాయించి పారనూకుతాడు, లంజాకొడుకా నువ్వు మూడేళ్లు నుంచి ఉంటే ఏం చేస్తున్నావు అని. మేము మర్చిపోతే నువ్వు చెప్పబడలేదా అని! అంటారు గామోనని. టక్కున ఈడు ఆ కాయితం ఎత్తుకొని సూపరింటెండెంట్ దగ్గరికి పోయినాడు. మమ్మల్నియైతే లోపలికి రానీరు. వాడు పోస్ట్ మాస్టర్ గనుక వాడిని లోపలికి పోనిచ్చినారు. చదువుకున్నాడు, సార్ ఆయన ఏంది ఇట్టా రాస్తున్నాడు సార్! ఒక గూండా రాసినట్టు రాసినాడు సార్ అని అది.. ఇది.. అన్నాడు. ఇట్టా చూశాడా! అయితే మూడేళ్ళ నుంచి ఏం చేస్తున్నావోయ్! గూండా! గీండా! అంటున్నావే, పళ్ళు ఊడకొడతారు వాళ్ళు. వాళ్ళ ఇంట్లో ఉండి వాళ్ళు పెళ్ళి చేసుకోవాలనుకుంటే పర్మిషన్ ఇవ్వకుండా, మీకు ఇష్టం వచ్చినట్టు ఆడుతుంటారా మీరు! రేపు పొద్దుట లోపల ఖాళీ చేసేసివాళ్లకు పర్మిషన్ కాయితం రాసి ఇచ్చేసేయ్! అని తీసుకొని రా! టైప్ చేసుకొని రమ్మను! అన్నాడు.. ఇంకేముంది. వాడే వాడి టైపిస్ట్ కి పెట్టి టైప్ చేసుకొని వచ్చాక, నేను మళ్లా క్యాంపుకి పోతారేమోనని, సంతకం చేసి, ముద్ర వేసి వాడి చేతికి ఇచ్చేసినాడు. రేపు లోపల నువ్వు ఖాళీ చేసేయాల ఆ రూమ్, ఈ కాయితం ఎత్తుకొని పోయి ఆ అబ్బాయికి ఈయి! అంటే గూండా వచ్చి ఇప్పుడు రాత్రి పూట కట్టబడలా! ఇంకేంటీ!

అసలు నాకు ఆ ఐడియా ఇచ్చింది ఆయనమ్మ! అది ఎంత గొప్పదంటే అసలు మొదట నేను ఊరికినే మామూలు మాటల్లోనే ఆయనకి రాసుకుందాం, అయ్యా! మా అమ్మాయికి పెళ్లి, మీరు ఇన్ని మాట్లు

తిప్పుతుండారే, అని రాయాలనే ఎత్తుకున్నా! అట్ట తీసుకున్న తర్వాత, రాత్రికి రాత్రి కట్టిస్తాను, అనే మాట వచ్చింది. నా పేరు వ్రాసా కింద, వాడి పేరు వ్రాయలా! పక్కోడు పర్మిషన్ అడిగేది, పక్కోడు అడుగుతున్నాడు పర్మిషన్, పర్మిషన్ అడిగేది వాడు కాదు, నేను! నాది ఇల్లు ఆఁ! నువ్వు పోయి చెప్పుకో! ఏడనో! నాది ఇల్లు, ఆఁ! కాదంటావా? నిరూపించుకుంటావా నువ్వు? నాది కాదు ఇల్లు అని నిరూపించుకుంటావా? అంటే నేను కోర్టుకి తిప్పుకుంటాను, వాడు వస్తాడా కోర్టుకి? చెప్పు, చెప్పు తీసుకొని కొట్టనా వాడిని! ఏముందండి వీధిలో పోతుంటే మెడకాయ మలచి/మడిచి చెంప మీద ఒక దెబ్బ కొడితే నాకొడుకు గిరగిరా తిరిగి పడతాడు. ఓఁ మహానుభావా! ఎన్ని పనులు చేస్తావయ్యా! **మత్తః స్మృతిరిజ్ఞానం మపోహనం చ ।** అబ్బాఁ అబ్బాఁ నాయనా! గురువుగారు “భాను ప్రసాద్” గారు ఏడ నుండాడో గాని, ఎంత సేపు చెప్పేవాడోనమ్మా, మరుపు, స్మృతి, జ్ఞానము, అపోహఁ నేనేనంటే ఆయన దానిలో లీనంఅయిపోతాడు మనం తినలేదే? పెళ్ళాం నిద్రపోతుందే? రాత్రి ఒంటి గంట అయితే కూడా! ఎంత యక్టివ్ గా చెప్తుంటాడో!

## మహాత్ముల వాక్యాలు

### “నీవు - చూసేదంతా కలిపి నేను” - షిర్డీ సాయిబాబా

## ఈ చూడబడేదంతా కలసి నేను


శ్రీ సుబ్బరామయ్య సార్ సాయిశివకు వ్రాసిన లెటర్లో ప్రస్తావించింది మనందరమూ ప్రతి నిత్యమూ మననము, నిధి ధ్యాసలు చేయవలసినది. ఈ


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దగ్గాస్వామి

శీర్షికన ప్రతి నెల మనకు జరిగే సన్నివేశాలలో వ్యక్తులు, వస్తువులు, సంఘటనలు, క్రియలు అన్నీ కూడా సద్గురువే అనే దానిని విశ్లేషించే ప్రయత్నం చేస్తున్నాము.

సార్ సాయి శివకు వ్రాసిన లెటర్:

చివరగా ఒక మాట వ్రాసావు. ఒక్కొక్కప్పుడు మనసు సాయి మీద ఉంటుంది. మరొకప్పుడు ఎక్కడో ఉంటుంది అని వ్రాసావు. నిజమే అనేక వేల కోట్ల జన్మల నుండి సంప్రాప్తమైనదే మన మెదడు. దానిని తన కోతి గంతుల నుండి అరికట్టడం చాలా కష్టమే. అయితే వీలు కానిది మాత్రం కాదు. దానినే బాబా శ్రద్ధ, సబూరి అన్నారు. **అసలీ మనసు యొక్క చంచల స్వభావాన్ని అరికట్టాలి అనే శ్రద్ద ఉండాలట మాస్టారు చెబుతారు**. **"శ్రద్ధ అనేది అనుక్షణము ఉండవలసిన జాగ్రత్త అంటారు".** మనసులో ఇతర ఆలోచనలు వస్తే అది మానసిక వ్యభిచారమని భావించాలట. చేయవలసిన యోచన గాక మనస్సు దానంతటది ఎక్కడకో వెళ్లి ఆలోచించటమే వ్యభిచారం అన్నారు. శ్రద్ధ అనే దాన్ని బాబాకు సమర్పించడమంటే చాలా గొప్ప విషయం.

మనసును ఎప్పుడు కూడా ఖాళీగా వదలకూడదు. నిరంతరం పనిలో నిమగ్నం చేయమంటారు. **పనిలేని మనసే సర్వ అనర్థాలకు మూలమంటారు.** పనిచేస్తూ మనసు మాత్రం పిచ్చిగా యోచిస్తుంటుంది అది తప్పు. మనసు పనిలో నిమగ్నమవాలట. దానిని త్రికరణ శుద్ధి అన్నారు. (1) శరీరంతో పని చేయడం (2) నోటితో దైవ నామం చెప్పడం (3) మనస్సుతో ఆ పని ఎలా చేయాలో యోచిస్తుండడం. వేరే తలంపు రాకూడదు.

**పనిలేనప్పుడు విశ్రాంతి కోరినప్పుడు "ఈ చూడబడేదంతా కలసి నేను" అన్న బాబా వాక్యాన్ని విశ్లేషిస్తుండు.** మంచి మేత దొరుకుతుంది మనస్సుకు ఎలా?

సూర్యుణ్ణి చూచాము - సూర్యుడు, సూర్య కిరణములు, అందులోని వెలుగు, అందులోని వేడి, వీటి ద్వారా చూడబడే వస్తువులు, వస్తువులు చూచుటకు ఉపకరించే కన్నులు, కన్నులలోని ప్రాణశక్తి, నేను చూస్తున్నాను అని తెలిసే ఎరుక – ఇవన్నీ బాబానే అయితే నేను వేరు ఈ జగత్తు వేరు అనే భావనే అడ్డుగోడ. దాన్ని కూలదోయడం ఎలా బాబా! అదెలాగో నాకు నేర్పించకూడదా అని అడుగుతుండు.

అలాగే దోవన నడుస్తున్నాము. భూమి, దానిపై కనిపించే దుమ్ము, పేడ అన్నీ ఆయనే. ఈ శరీరం కూడా ఆయనే, శరీరం చుట్టు ఉన్న గాలి ఆయనే. శరీరాన్ని నడిపించే ప్రాణశక్తి ఆయనే. నడుస్తున్నట్లు తెలుసుకొనే ఎరుక గూడా ఆయనే. అంతా ఆయనే ఐనా నేను అనే పరిమిత భావమే అడ్డుగోడ. దీన్ని కూల ద్రోయమన్నావే అది ఎలా బాబా అని అడుగు.

స్నానం చేస్తున్నాము - ఈ నీరు బాబానే, మనం నిలుచునేందుకు ఆధారమైన భూమి ఆయనే. ఆయనకు ఆయన చేతిని కదిలిస్తూ హాయిని ఇప్పిస్తూ హాయిని అనుభవించుచున్నట్లు తెలుసుకుంటున్న ఎరుక ఆయనే కానీ నేను అనే పరిమిత భావమే అడ్డుగోడ. దీనినీ కూలద్రోయడం ఎలా అని అడుగు.


ఇదే విధంగా అన్నం తినేటప్పుడు, నీళ్ళు త్రాగేటప్పుడు, పనిలేని విశ్రాంతి సమయాలలోను నీవు చూచే ప్రతి వస్తువు వంక నవ్యనూతనంగా చూడమంటారు మాస్టర్. నాకు అడ్డుగోడను కూలద్రోసే technique చేత


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

గాకున్న ఇలా వ్రాయడం మాత్రం కొద్దిగా వచ్చు. అడ్డుగోడను ఎప్పుడు కూలద్రోయిస్తారో, అది శ్రీ స్వామివారి పని.

**శ్రద్ధతో - చదువు లేనప్పుడు మనసు విశ్రాంతి కోరినప్పుడు – ఎక్కడో ఆలోచించకుండా చూచిన ప్రతి వస్తువులోను విశ్లేషించి బాబాను చూస్తుంటే అది కూడా ధ్యానమే అవుతుంది**. ధ్యానమంటే కళ్ళు మూసుకొని కూర్చోవడమే కాదు.

**-------- సద్గురు దేవా శరణం శరణం ---------**

**మదన్ కుమార్ తన యొక్క అవగాహనను ఇలా తెలియజేస్తున్నారు.**

**ఓం నారాయణ – ఆదినారాయణ**

నేను అంటే ఈ శరీరమే అన్న స్పృహ నుంచి నేను అంటే సర్వవ్యాపకమైన చైతన్యము అది అంతట అన్నివేళలా నిండి ఉన్నది అనేది మాస్టారి రచనల వలన మహనీయులు కృప వలన భావనాపూర్వకంగా అర్థమయింది. కానీ దానిని అనుభవంలోకి తీసుకురావడానికి, ఆచరణలో పెట్టడానికి ఏమి చేయాలి అనేది నా ప్రశ్న!

మాస్టారు గారి రచనల వలన శ్రీ సార్ సత్సంగాల ద్వారా మహనీయుల చరిత్ర పారాయణం వలన (వెంకయ్య స్వామి, రమణ మహర్షి, బాబా, రామకృష్ణ పరమహంస) జీవితం పట్ల, జీవితానుభవాల పట్ల నాలో వచ్చిన మార్పులు తద్వారా ఆ మహనీయులు బోధలను నేను ఆచరిస్తున్న విధానాన్ని కొన్ని గురు బంధువులతో పంచుకుంటున్నాను.

ఇవి వ్రాసుకోవడంలో నా ముఖ్య ఉద్దేశ్యం ఎవరికి వాళ్లము నిజాయితీగా మన జీవిత లక్ష్యాన్ని విశ్లేషణ చేసుకొని దాన్ని పొందడానికి మనం ఆచరిస్తున్న మార్గాన్ని నోట్ చేసుకోవడం వలన మరొకమారు ఆ

లక్ష్యం గుర్తింపుని నిలుపుకుని, మన ప్రయత్నం (సాధన) యొక్క పటుత్వం పెంచుకోవడానికి మాత్రమే!.

నా హృదయంలో గాఢంగా ముద్రించుకున్న కొన్ని అంశాలు!

**1. వ్యక్తులు ఎవరు స్వతంత్రులు కాదు!**

ఆనందము, శాంతి మన సహజ స్వరూపము! అని అర్థం అయింది. రోజులో, నిత్య జీవిత అనుభవాలలో అది (ఆనందం) ఎప్పుడు డిస్టర్బ్ అవుతుందా అని ఆలోచిస్తే ఎక్కువ శాతం వ్యక్తులు (కుటుంబ సభ్యులు, మిత్రులు, తోటి ఉద్యోగస్తులు), అనుభవాలు దానిని డిస్టర్బ్ చేస్తున్నాయి అని అర్థమైంది. ఎప్పుడైనా ఆ ఆనందము, శాంతి డిస్టర్బ్ అయినప్పుడు ఎక్కువసార్లు గుర్తొస్తున్న విషయం వ్యక్తులు ఎవరు స్వతంత్రులు కాదు! అంతా బొమ్మలాటలో భాగంగా శ్రీ స్వామి వారు ఆడించినట్లు ఆడుతున్న వారే!, వాళ్ళు మాట్లాడే మాటలు, చేసే పనులు అన్నీ స్వతంత్రమైనవి కాదు. అంతా ఆయన లోపల ఉండి చేస్తున్నారు అన్న ఆలోచన నన్ను త్వరగా దుఃఖము, అశాంతి నుంచి మేలుకొలిపి మరల ఆనందము శాంతి వైపు నడిపిస్తుంది.

వ్యక్తులు స్వతంత్రులు కాదు అన్న విషయం ఎవరైనా నన్ను బాధ పెట్టినప్పుడు మాత్రమే అప్లై చేయగలుగుతున్నాను. కానీ నా పక్కనే ఉంటూ నాకు నచ్చినట్టు నాతో ఇష్టంగా ఉండే వారి పట్ల దాన్ని గుర్తించలేకున్నాను స్వామి వారి కృప వలన నన్ను ఇష్టపడే వ్యక్తులు కూడా స్వతంత్రులు కాదు, నేను కూడా స్వతంత్రుడిని కాదు అనేది గుర్తించి అన్ని సందర్భాలలోనూ అంతా ఆయనే ఆడిస్తున్నారు అన్న స్పృహ కలిగించాలని ప్రార్థిస్తున్నాను.


**2. ఈ కనబడే ప్రపంచం అంతా నా ప్రొజెక్షన్ మాత్రమే!**


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

నేను ఎప్పుడైనా ఏ కొత్త ప్రదేశానికి వెళ్లినా, లేక మామూలుగా రోజూ నేను ఉన్న ప్రదేశం లోనైనా ఆకాశం, చెట్లు, పక్షులు, నేల, గడ్డి ఇవన్నీ చూసి ఒక రకమైన ఆనందం కలుగుతుంది. ప్రకృతి అందాలని ఆస్వాదిస్తే చాలా ఆనందం కలుగుతుంది.

శ్రీ స్వామి వారు చెప్పినట్లు అయ్యా! ఈ కనపడేదంతా నిజం అనుకుంటున్నారా? అని బాబా చెప్పినట్టు "నువ్వు చూసేదంతా కలిపి నేను!" అని భగవాన్ రమణ మహర్షి చెప్పినట్టు "నువ్వు మేల్కొని ఉంటేనే ప్రపంచము, నువ్వు చూడకుంటే ప్రపంచమే లేదు!" అనే విషయాలు గాఢంగా గుర్తొస్తుంటాయి. అంటే నేను మెలకువ అన్న స్థితిలో ఉన్నానని, ఆ చైతన్యం మొదట నా దేహం మీద ప్రొజెక్ట్ అయి దేహం నుంచి మనసు, పంచేంద్రియాల ద్వారా ప్రపంచాన్ని ప్రొజెక్ట్ చేసి మరలా వాటి ద్వారానే నాకు చూపిస్తుంది అన్న విషయం మనసుకి చాలాసార్లు అనిపిస్తుంటుంది.

పరిసరములు తనపై ప్రతిబింబించు దానిని మనస్సు అందుము. పరిసరములపై తాను ప్రతిబింబించు దానిని జ్ఞానమందుము.


- Master EK

### 3. మా అనుభవములన్నీ నీ ప్రసాదములుగా స్వీకరించుదుము గాక!

చాలాసార్లు మనం ఏది అనుకుంటే అది జరగాలి అలా జరగనప్పుడు కొంచెం కష్టంగానూ, ఇబ్బందిగాను ఉంటుంది నాకు మరీ ఎక్కువగా ఉండేది. ఆ ఇబ్బంది కష్టం కలిగించిన వ్యక్తులు, పరిస్థితులు పైన నా అభిప్రాయాలు గట్టిగా ముద్రించుకునే వాడిని. కానీ ఎప్పుడైతే సత్సంగాలలో మా అనుభవములన్ని మీ ప్రసాదముగా స్వీకరించుదము గాక అన్న విషయం తెలుసుకున్నానో చాలా వరకు స్వతంత్రులుకాని వ్యక్తులు తద్వారా








మనకు ఎదురయ్యే అనుభవములు అన్ని ఆ మహనీయుడు ఏరి కోరి ప్రసాదిస్తున్నారు. మా అనుభవములన్నియు మీ ప్రసాదములు అని గుర్తించడం ద్వారా మనసు పొంగు కొంగుల నుంచి తొందరగా ఉపశమిస్తుంది.

కష్టమైన పరిస్థితి ఎదురైనప్పుడు “ఆహా! తండ్రి ఏమిటి ఇలాంటి పరిస్థితి ఏర్పాటు చేశావు అని ఆయనతోనే చెప్పుకోవడం జరుగుతుంది. ఈ పరిస్థితి నుంచి బయటపడడానికి శక్తిని ధైర్యాన్ని ఇవ్వు తండ్రీ! అని ప్రార్థన చేస్తున్నాను. కానీ సంతోషకరమైన పరిస్థితిని ఏర్పాటు చేసినప్పుడు ఆయన ఊసు అసలు గుర్తే రావడం లేదు, నేను సంతోషంగా ఉన్నాను అన్న స్పృహ లేకుండా ఉంది దానిని కూడా ఆయన ప్రసాదంగా గుర్తించి ఆయన ప్రసాదంగా స్వీకరించే స్థితిలో ఉంచాలని కోరుకుంటున్నాను.

**4. మన శత్రువు, మిత్రుడు మన మనసే! దానిని అన్నివేళలా సమత్వంలో ఉంచడమే సాధన!**

అసలు నేను ఇప్పటివరకు ఏమి నేర్చుకున్నాను? ఆధ్యాత్మిక ద్వారా? మరియు నేను చేస్తున్న ఉద్యోగం ద్వారా? నా జీవిత అనుభవాల ద్వారా? ఏమి నేర్చుకున్నాను? అని నా గురించి నేను ఆలోచించినప్పుడు మనసుకి ఒక విషయం గాఢంగా అనిపించింది. ఇన్ని సాధనలు నేను చేసేది కేవలం నా మనసుని సమత్వంలో ఉంచుకోవడానికే! అంటే మనసు ఒక్కొక్కసారి బాగా ఎక్సైటెడ్ గాను, మరొకసారి ఏమాత్రం శక్తి లేనట్టు కుంగిపోయి ఉంటుంది. కానీ దానిని అన్ని పరిస్థితులలో వర్తమానంలో ఉంచుతూ, అవసరమైనది చేస్తూ మనసుతో స్నేహపూర్వకంగా ఉంటూ, అది చెప్పినట్లు కాకుండా మనకి ఏమి కావాలో దానితో చేయించుకునేటట్లు ఉండడం సాధన అనిపిస్తుంది.

నీ మనసే నీ మిత్రుడు, నీ శత్రువు! మనసు వశంలో నువ్వు ఉంటావా? నీ వశంలో మనసును ఉంచుకుంటావా? అనే దానినిబట్టే నీ మిగతా అనుభవములన్నియు నిర్ణయించబడి ఉన్నాయి. అట్టి మనసుని భగవంతుని పాదాల వద్ద సమర్పించి ఆయనకి శరణాగతి చెందడం ద్వారా దానితో స్నేహ పూర్వకంగా సమత్వంలో ఉండవచ్చు అని అర్థమైంది.

తద్వారా పరమ శాంతిలో నిరంతరం ఉండవచ్చు, అంతా ఆయన సంకల్పం మరియు కృప మాత్రమే!

ఓం నారాయణ ఆదినారాయణ 🙏



**సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ పాదుకలు**